TGTEL/26/A2635
వాస్తవాలు పలుకు
DD9 వార్త
తెలుగు దినపత్రిక

## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

బీజేపీ విజయానికి హైదరాబాద్ నుంచే నాంది పలుకుతామన్న రాంచందర్ రావు
బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా
బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ వైపు చూస్తోందన్న లక్ష్మణ్



02






హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 46 | 28-06-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల: 3/-

# ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ సైజుపై కొత్త నిబంధనలు

**500 నుంచి 750 చదరపు అడుగులకే శ్లాబ్ పరిమితం**

శ్లాబ్ విస్తీర్ణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక జీవో
ముందు వైపు 3 అడుగులు.. మిగతా వైపుల ఒక్క అడుగే
గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు
లబ్ధిదారులపై అదనపు భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
శ్లాబ్ విస్తీర్ణం పెరగడంతో నిర్మాణ వ్యయం అధికమవుతున్నట్లు గుర్తింపు
ఏకరీతి నమూనాతో ఇళ్ల నిర్మాణానికి మార్గదర్శకాలు
ప్రభుత్వ నిధుల సద్వినియోగానికి కొత్త నిబంధనలు
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వ్యయ నియంత్రణకు ప్రాధాన్యం
కొత్త నిబంధనలు రాష్ట్రవ్యాప్తంగా అమలు

డిడి9 వార్త, హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో శ్లాబ్ విస్తీర్ణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల నిర్మాణ వ్యయం పెరగకుండా, లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండేలా శ్లాబ్ సైజుపై స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు విడుదల చేశారు. కొత్త నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ విస్తీర్ణం 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్య మాత్రమే ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే శ్లాబ్‌కు ఇంటి ముందు భాగంలో గరిష్ఠంగా మూడు అడుగుల ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ఉండగా, మిగతా మూడు వైపులా ఒక్క అడుగు మాత్రమే ఉండాలని పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు పక్కా ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుండగా, లబ్ధిదారులు కూడా కొంత మొత్తం భరించి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. అయితే ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మిగతా 7లో..



## మూడు రాష్ట్రాల సీఎంల భేటీ వివరాలు వెల్లడించాలి

హొస్పేట భేటీపై శ్వేతపత్రం విడుదల చేయాలి
రహస్య ఒప్పందాల వివరాలు ప్రజలకు చెప్పాలి
శాసనసభలో ఒప్పందాలను ప్రవేశపెట్టాలి
కర్ణాటకతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్
ఉత్తమ్, అధికారులను బయటే ఉంచారని విమర్శ
తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న ఆందోళన
చంద్రబాబు మాటే కేంద్రం వింటోందని వ్యాఖ్య
ఓటమి భయంతో నిజాలు దాస్తున్నారన్న విమర్శ
తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని హెచ్చరిక



డిడి9 వార్త, హైదరాబాద్

మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కర్ణాటకలో జరిగిన భేటీలో ఏం చర్చించారో, ఎలాంటి ఒప్పందాలు కుదిరాయో ప్రజలకు వెల్లడించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చారిత్రక ఒప్పందం జరిగిందని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ ఒప్పందాల పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. శనివారం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. కర్ణాటక ప్రభుత్వంతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారనే అనుమానం వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకతో జరిగిన ఒప్పందాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. హోస్పేటలో జరిగిన సీఎంల సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులను బయట కూర్చోబెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవిష్యత్‌కు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతిలో ఎలా పెడతారని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏది చెబితే కేంద్ర ప్రభుత్వం అదే వింటోందని హరీశ్‌రావు విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగితే బీఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను మిగతా 7లో..

## ప్రజలపై పన్నుల భారం.. పెట్రోల్ ధరలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు తగ్గినా దేశంలో రేట్లు తగ్గట్లేదన్న ఖర్గే
ప్రజలను పన్నుల వసూలు వనరులుగా చూస్తున్నారని కేంద్రంపై విమర్శ
గతంలో కంటే క్రూడ్ ధరలు తగ్గినా ప్రయోజనం లేదని ఆరోపణ





డిడి9 వార్త, హైదరాబాద్

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను కేవలం పన్నులు వసూలు చేసే వనరులుగానే పరిగణిస్తోందని ఆయన ఆరోపించారు.
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నేపథ్యంలో ముడి చమురు బ్యారెల్ ధర 138 డాలర్లకు చేరినప్పుడు, దేశంలో లీటర్ పెట్రోల్ ధర సుమారు రూ. 94.77గా ఉండేదని ఖర్గే గుర్తుచేశారు. ప్రస్తుతం క్రూడ్ ధర 70 నుంచి 82 డాలర్ల మధ్య ఉన్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్ ధర రూ. 101 111, డీజిల్ ధర రూ. 95 100 మధ్య కొనసాగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని మిగతా 7లో..

## కేతన్ హత్య కేసులో షాకింగ్ ట్విస్ట్

పెళ్లి తప్పించుకోవడానికే హత్యకు కుట్ర?
ప్రియుడితో కలిసి పథకం రచించిన సియా
ఆరు బృందాలతో దర్యాప్తు ముమ్మరం
సియా కుటుంబ సభ్యుల విచారణ కొనసాగింపు
రెండోసారి సోదరుడిని విచారించిన పోలీసులు
క్రికెట్ మ్యాచ్‌లో చేతన్‌తో పరిచయం
2 వేలకుపైగా కాల్స్ గుర్తించిన పోలీసులు
238 గంటలు మాట్లాడుకున్నట్లు వెల్లడి
డిలీట్ చేసిన డేటా రికవరీకి ప్రయత్నాలు

డిడి9 వార్త, హైదరాబాద్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ (26) హత్య కేసు దర్యాప్తు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో తాజాగా వెలుగులోకి వచ్చిన అంశాలు మరింత సంచలనం రేపుతున్నాయి. కేతన్‌ను వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి హత్యకు పథకం రచించినట్లు పోలీసు విచారణలో వెల్లడైనట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. పుణె రూరల్ పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. కుటుంబ సభ్యులకు తాను మిగతా 7లో..





## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించం

రైతులు, గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం కలిగించే చట్టమని వ్యాఖ్య
తెలంగాణ క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో విస్తృత చర్చ
చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచన
కేరళ, కర్ణాటకతో కలిసి ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం
రైతుల హక్కులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టమని విమర్శ
అమలుపై ప్రభుత్వం న్యాయపరమైన అవకాశాల పరిశీలన
మంత్రులు సీతక్క, తుమ్మల, వివేక్ హాజరు
తదుపరి కార్యాచరణపై త్వరలో తుది నిర్ణయం
ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమన్న ఉత్తమ్



డిడి9 వార్త, హైదరాబాద్

వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, వారి ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు, పేదల భవిష్యత్‌కు భంగం కలిగించే ఏ చట్టాన్నీ తెలంగాణ ప్రభుత్వం మిగతా 7లో..

## హైదరాబాద్‌లో రోహింగ్యాలు..

ఎవరెన్ని కుట్రలు చేసినా ఎస్ఐఆర్ ఆగదు: కిషన్‌రెడ్డి
నగరంలో అక్రమ రోహింగ్యాలు ఉన్నారని కేంద్ర మంత్రి ఆరోపణ
పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి ఓటరు కార్డులున్నాయని వ్యాఖ్య
పాతబస్తీలో బీఎల్‌వోలను మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని విమర్శ
ఓటరు జాబితా సవరణను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణ
కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపాటు
ఎవరెన్ని కుట్రలు చేసినా ఎస్ఐఆర్ ప్రక్రియ ఆగదని స్పష్టం
రామ్‌కోఠిలో కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి
చిన్నారులకు పాఠ్యపుస్తకాల పంపిణీ
ఖైరతాబాద్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన కిషన్‌రెడ్డి
అక్రమ చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



డిడి9 వార్త, హైదరాబాద్

నగరంలో పెద్ద సంఖ్యలో రోహింగ్యాలు అక్రమంగా నివసిస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి వచ్చిన కొందరికి హైదరాబాద్‌లో ఓటరు గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
శనివారం రామ్‌కోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం చిన్నారులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మిగతా 7లో..

# మూడు రాష్ట్రాల సీఎంల భేటీ వివరాలు వెల్లడించాలి

**మొదటిపేజీ తరువాయి**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.
కాగా, ఈ నెల 25న కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు.

# హైదరాబాద్‌లో రోహింగ్యాలు..

**మొదటిపేజీ తరువాయి**



ప్రారంభించారు.
అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పాతబస్తీలో బూత్ లెవల్ ఆఫీసర్లను (బీఎల్‌వోలు) మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయ రంగు పులమేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో అక్రమంగా పేర్లు నమోదైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం ఎన్నికల సంఘం బాధ్యత అని కిషన్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు ఉండాలని, అదే సమయంలో అక్రమంగా దేశంలోకి వచ్చిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండకూడదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'సర్'ను సీరియస్ గా తీసుకోం

- **మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్**
- **కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి**
- **రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా**

**డిడి9 వార్త, హైదరాబాద్**




మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.
రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు.
మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

## హస్సేన్ హుస్సేన్ దేవస్థానాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి 9 వార్త)**

తలమడుగు మండలం రుయ్యాడి గ్రామ హస్సన్ హుస్సేన్ దేవస్థానాన్ని బోథ్ ఎమ్మెల్యే దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ మొహరం పండుగ అని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన రుయ్యాడి దేవస్థానాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు గ్రామస్తులు ఐక్యమత్యంతో పండగ జరుపుకోవడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు మొహరం పండగ అయ్యేంతవరకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కాళ్లకు చెప్పులు ధరించకుండా ఎక్కడున్న వారు కూడా తమ సొంత గ్రామానికి వచ్చి పండగను జరుపుకోవడం చాలా గొప్ప విషయమని అన్నారు వీరి వెంట ముఖ్య నాయకులు మొట్టె కిరణ్ కుమార్ సుదర్శన్ రెడ్డి సతీష్ రవికాంత్ యాదవ్ మరియు ఆయా మండలాల కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు



# ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ సైజుపై కొత్త నిబంధనలు

**మొదటిపేజీ తరువాయి**



ప్రభుత్వం నిర్మాణ వ్యయాన్ని నియంత్రించే దిశగా కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది.
లబ్ధిదారులు అనుమతించిన పరిమితికి మించి శ్లాబ్ విస్తీర్ణాన్ని పెంచుతున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ దృష్టికి వచ్చింది. దీంతో సిమెంట్, ఇనుము, కాంక్రీట్ తదితర నిర్మాణ సామగ్రి వినియోగం పెరిగి నిర్మాణ వ్యయం కూడా గణనీయంగా అధికమవుతోందని అధికారులు గుర్తించారు.
శ్లాబ్ విస్తీర్ణం పెరగడం వల్ల ప్రభుత్వం మంజూరు చేసే నిధులు సరిపోక, అదనపు ఖర్చు లబ్ధిదారులపై పడుతున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ ప్రభుత్వానికి నివేదించింది. చాలా మంది లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీని వల్ల ఇళ్ల నిర్మాణం ఆలస్యమవుతోందని కూడా అధికారులు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్త ఉత్తర్వుల ప్రకారం శ్లాబ్ పరిమాణాన్ని నిర్ణీత ప్రమాణాలకు లోబడి నిర్మించాల్సి ఉంటుంది. ఇంటి ముందు భాగంలో మూడు అడుగుల వరకు మాత్రమే ప్రొజెక్షన్‌కు అనుమతి ఉంటుంది. ఇది వర్షపు నీరు నేరుగా గోడలపై పడకుండా ఉండటంతో పాటు ఇంటి ముందు భాగంలో కొంత రక్షణ కల్పించేందుకు ఉపయోగపడుతుంది. అయితే మిగతా మూడు వైపులా ఒక అడుగు కంటే ఎక్కువ ప్రొజెక్షన్ ఉండకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనలతో అవసరానికి మించిన నిర్మాణాలను నివారించి వ్యయాన్ని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఒకవైపు నాణ్యతను కాపాడుతూనే మరోవైపు నిర్మాణ వ్యయాన్ని అదుపులో ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే నమూనా అమలులో ఉండేలా జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ అధికారులు, ఇంజినీర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా నిర్మాణాలు ప్రారంభించే వారు తప్పనిసరిగా ఈ నిబంధనలను పాటించాలని సూచించారు.
ప్రభుత్వం నిర్దేశించిన నమూనాను అనుసరించడం వల్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు వ్యయ అంచనాలు కూడా ఒకే విధంగా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఇంటికి అవసరమైన నిర్మాణ సామగ్రి పరిమాణాన్ని ముందుగానే అంచనా వేయడం సులభమవుతుందని, దీనివల్ల నిధుల వినియోగంలో పారదర్శకత కూడా పెరుగుతుందని భావిస్తున్నారు.
హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల నిర్మాణ సామగ్రి ధరలు గణనీయంగా పెరిగాయి. సిమెంట్, స్టీల్, ఇసుక, కంకర, కూలీల చార్జీలు పెరగడంతో ఇళ్ల నిర్మాణ వ్యయం కూడా పెరిగింది. ఈ పరిస్థితుల్లో శ్లాబ్ విస్తీర్ణాన్ని అవసరానికి మించి పెంచితే లబ్ధిదారులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. అందుకే నిర్మాణ వ్యయాన్ని నియంత్రించేందుకు ఈ పరిమితులు విధించినట్లు అధికారులు వివరించారు.
కొత్త నిబంధనల అమలుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏకరీతి ప్రమాణాలు పాటించే అవకాశం ఉంది. నిర్మాణ నాణ్యతను కాపాడుతూ, అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం సద్వినియోగం అయ్యేలా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే లబ్ధిదారులు అదనపు అప్పుల భారం లేకుండా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.
ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులు నిర్మాణ ప్రక్రియలో కీలక మార్పులకు దారితీయనున్నాయి. ఇకపై అన్ని కొత్త నిర్మాణాలు ఈ మార్గదర్శకాల ప్రకారమే చేపట్టాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## ప్రజలపై పన్నుల భారం.. పెట్రోల్ ధరలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

**మొదటిపేజీ తరువాయి**



ప్రజలకు ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నించారు.
బీజేపీ ప్రభుత్వం సామాన్యుల జేబులు ఖాళీ చేస్తూ ప్రజలను దోచుకుంటోందని ఖర్గే ధ్వజమెత్తారు. ప్రజలను కేవలం పన్నుల వసూలు సాధనంగానే కేంద్రం చూస్తోందని మండిపడ్డారు. యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపి కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ ధరలను రెట్టింపు చేసిందని, ప్రస్తుతం సరఫరా సాధారణ స్థితికి వచ్చినా ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఆయన నిలదీశారు.
భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. గతంలో చమురు ధరలు పెరిగిన సమయంలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు భారీ నష్టాలను చవిచూశాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ధరలు తగ్గినా, గత నష్టాలను పూడ్చుకోవడం, దిగుమతి చేసుకున్న చమురు దేశానికి చేరడానికి పట్టే సమయం, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు, అధిక పన్నుల వంటి కారణాల వల్ల దేశీయంగా ధరలు తగ్గడం లేదని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించం


**మొదటిపేజీ తరువాయి**



సమర్థించదని ఆయన స్పష్టం చేశారు.
వీబీజీ రామ్‌జీ పథకానికి సంబంధించిన అంశాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీ శనివారం సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వల్ల రాష్ట్రంపై పడే ప్రభావం, రైతులు, గ్రామీణ వర్గాలపై ఏర్పడే పరిస్థితులు, ప్రభుత్వం అనుసరించాల్సిన న్యాయ, పరిపాలనా చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచే రైతుల ప్రయోజనాలకు కట్టుబడి ఉందన్నారు. రైతుల ఆదాయం పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించడం, వ్యవసాయ రంగం బలోపేతం కావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అలాంటి సమయంలో రైతులకు నష్టం కలిగించే చట్టాలను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు.
వీబీజీ రామ్‌జీ చట్టం అమల్లోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని, పేదల జీవనోపాధిపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ చట్టాన్ని న్యాయపరంగా సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. చట్టంలోని నిబంధనలను నిపుణులతో పరిశీలించి, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు రాష్ట్ర హక్కులను కాపాడేందుకు అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన మార్గాలను వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో తెలంగాణ ఒక్క రాష్ట్రంగా కాకుండా, ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్న ఇతర రాష్ట్రాలతో కలిసి ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలను కూడా ఈ పోరాటంలో భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల జీవనోపాధికి విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నైనా చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని తెలిపారు.
క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో చట్టంలోని వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. చట్టం అమలైతే రాష్ట్రంలో ఉపాధి, వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వివిధ శాఖల నుంచి వచ్చిన నివేదికలను కూడా కమిటీ పరిశీలించింది.
ప్రభుత్వం న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించి తదుపరి కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకోనుంది. అవసరమైతే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి వ్యూహాన్ని అమలు చేయడంతో పాటు న్యాయపోరాటాన్ని కూడా కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పేదల సంక్షేమం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. రైతులపై భారం మోపే, గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బతీసే ఏ చట్టాన్నైనా వ్యతిరేకిస్తామని, ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు.

## కేతన్ హత్య కేసులో షాకింగ్ ట్విస్ట్

**మొదటిపేజీ తరువాయి**



ఈ వివాహం చేసుకోవడం ఇష్టం లేదని చెప్పి వారిని బాధపెట్టడం కంటే, కేతన్‌ను హత్య చేయడమే సులభమని భావించినట్లు సియా విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ కోణంలో పోలీసులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.
మరోవైపు కేసు విచారణను వేగవంతం చేసిన పుణె రూరల్, లోనావాలా పోలీసులు మొత్తం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సియా గోయల్ తల్లిదండ్రులను లోనావాలా సిటీ పోలీస్ స్టేషన్‌లో విచారించగా, ఆమె సోదరుడు సాహిల్‌ను రెండోసారి ప్రశ్నించారు. శుక్రవారం దాదాపు పది గంటలపాటు సాగిన విచారణలో సాహిల్ పలు కీలక వివరాలను వెల్లడించినట్లు సమాచారం.
చేతన్ చౌదరి తనకు పరిచయమేనని, తన సోదరి సియా ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా అతడిని తనకు పరిచయం చేసిందని సాహిల్ పోలీసులకు తెలిపినట్లు తెలుస్తోంది. అనంతరం గత ఏడాది ఓ ఉమ్మడి స్నేహితుడు నిర్వహించిన దీపావళి వేడుకల్లో మరోసారి కలిసిన తర్వాత సియా, చేతన్‌ల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.
దర్యాప్తులో భాగంగా నిందితుల కాల్ డేటా రికార్డులను విశ్లేషించిన పోలీసులు కీలక విషయాలను గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి సియా, చేతన్ మధ్య దాదాపు 2 వేల ఫోన్ కాల్స్ జరిగినట్లు, మొత్తం 238 గంటల పాటు వారు సంభాషించినట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ వివరాలు కుట్ర కోణాన్ని బలపరుస్తాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.
కేసులో మరిన్ని ఆధారాలు సేకరించేందుకు నిందితులు తమ మొబైల్ ఫోన్‌ల నుంచి తొలగించిన డేటాను తిరిగి రికవరీ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. చాట్ హిస్టరీ, కాల్ రికార్డులు, ఇతర డిజిటల్ ఆధారాలను సేకరించి హత్యకు సంబంధించిన పూర్తి కుట్రను ఛేదించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ అంశాలపై పోలీసులు ఇంకా అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

- **బీజేపీ విజయానికి హైదరాబాద్ నుంచే నాంది పలుకుతామన్న రాంచందర్ రావు**
- **బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా**
- **బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ వైపు చూస్తోందన్న లక్ష్మణ్**

**డిడి 9 వార్త, హైదరాబాద్**

పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచుకోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రేపు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు.
మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.



# బీసీలకు తెలంగాణలో తీరని అన్యాయం

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు కుట్రలను అడ్డుకుంటాం**
- **జులై 2న రాష్ట్రవ్యాప్త కాలేజీల బంద్, 15న 'చలో హైదరాబాద్'**
- **బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే తెలంగాణ ఏర్పడిన తర్వాతే బీసీలకు ఎక్కువ అన్యాయం జరుగుతోందని, పాలన మారింది తప్ప పాలకుల ధోరణిలో మార్పు లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. శనివారం నిజామాబాద్‌లోని కేర్ డిగ్రీ కళాశాలలో బీసీ సంఘాల జిల్లా స్థాయి సమావేశం నరాల సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ సాధన కోసం ఎందరో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు త్యాగాలు చేస్తే, నేడు ఆ ఫలాలను పిఃడికెడు శాతం కూడా లేని అగ్రకులాలు అనుభవిస్తున్నాయని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 24 మంది బీసీ ఎమ్మెల్యేలు ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 19కి పడిపోయిందని, మంత్రివర్గంలోనూ బీసీలకు ప్రాధాన్యత తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం డిప్యూటీ సీఎం పదవిని కూడా బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడకుండా అణచివేస్తున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే కోర్టుల ద్వారా పరోక్షంగా ఈ నిర్ణయాన్ని అమలు చేయిస్తోందని ఆయన



ఆరోపించారు. 7వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేస్తూ, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్లు 7, 8, 9లు విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకంగా మారాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 2న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్ నిర్వహిస్తున్నామని, అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 15న సుందరయ్య పార్కు నుంచి ఇందిరా పార్కు వరకు 'చలో హైదరాబాద్' పేరుతో భారీ విద్యార్థి మార్చ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలి

- **పెంటకుర్దులో ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం బోధన్ మండలం పెంటకుర్దు గ్రామంలో హెలెన్ కెల్లర్ 146వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గైని రాములు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్ మాట్లాడుతూ.. అంధురాలిగా, చెవిటిదిగా పుట్టినప్పటికీ అపారమైన పట్టుదలతో రాడ్‌క్లిఫ్ కాలేజీ నుంచి డిగ్రీ పట్టా అందుకున్న హెలెన్ కెల్లర్ జీవితం నేటి తరం వికలాంగులకు దిశానిర్దేశమని కొనియాడారు. ఆమె 14 పుస్తకాలు రాసి, వందలాది ప్రసంగాల ద్వారా సామాజిక మార్పు కోసం కృషి చేశారని గుర్తు చేశారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు భయం వీడి తమ హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా ఆచరణాత్మకమైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, పాత వారికి పెన్షన్లను పెంచి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింటూ, సాయినాథ్, ఈశ్వర్ పటేల్, గంగారం పటేల్, సంజీవ్ పటేల్, సలీం, ఆదినారాయణ, జయరాం, గంగారం, సోనీ, లక్ష్మి, జానాబాయ్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.





# మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన తప్పదు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

జిల్లా ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారని, వెంటనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన సిబ్బందిని నియమించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టులు, ఎముకల వైద్య నిపుణులు లేకపోగా, స్కానింగ్‌కు కనీసం టెక్నీషియన్లు కూడా లేరని ఆయన మండిపడ్డారు. దీనివల్ల రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాబినెట్ హోదా కలిగిన స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆసుపత్రి అభివృద్ధిని పట్టించుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. తక్షణమే వైద్యులు, టెక్నీషియన్లను నియమించి, మందులను అందుబాటులో ఉంచాలని లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని రమేష్ బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఏరియా కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు వేషాల గంగాధర్, జంగం గంగాధర్, రాములు, నాగలక్ష్మి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

- **426 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు**
- **- రూ. 41.60 లక్షల జరిమానా విధించిన కోర్టులు**
- **- వివరాలు వెల్లడించిన సీపీ పి. సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**



మద్యం సేవించి వాహనాలు నడుపుతూ రోడ్డు భద్రతకు విఘాతం కలిగిస్తున్న వారిపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత రెండు వారాల వ్యవధిలో కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 426 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 15 నుంచి 27 వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుబడిన వారందరినీ నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల్లో హాజరుపరచగా, 10 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష పడింది. మిగిలిన వారికి మొత్తం రూ. 41లక్షల 60 వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ...హనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. వాహనానికి సంబంధించిన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులను 6 నెలల పాటు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ కూడా వర్తించదని పేర్కొన్నారు. మోటార్ వాహనాల చట్టం (సవరణ 2019) ప్రకారం మొదటిసారి పట్టుబడితే రూ. 10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే రూ. 15 వేల జరిమానా లేదా జైలు శిక్ష తప్పదని కమిషనర్ స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారిపై మరియు వాహన యజమానిపై చార్జిషీట్లు నమోదు చేసి, జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఫతేపూర్‌లో గ్రామాన్ని సందర్శించిన తహసీల్దార్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

సాలూర మండలంలోని ఫతేపూర్ గ్రామంలో శనివారం తహసీల్దార్ అజ్మత్ నవాజ్ 'ఎస్ఐఆర్' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రంతో పాటు బూత్ స్థాయి అధికారుల పనీతిరును పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు సకాలంలో అందేలా విధి నిర్వహణలో సిబ్బంది చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న తహసీల్దార్, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూర్ అహ్మద్, ఉప సర్పంచ్ మోసీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పోలియో రహిత సమాజమే లక్ష్యం

- **జిల్లావ్యాప్తంగా నేడు పల్స్ పోలియో చుక్కల పంపిణీ**
- **1.91 లక్షల మంది చిన్నారులే లక్ష్యం: డీఎంహెచ్ఓ**

**నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో నిజామాబాద్ నగరంలో శనివారం పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ భుజంగరావు జెండా ఊపి ప్రారంభించారు. బస్టాండ్, తిలక్ గార్డెన్ చౌరస్తా మీదుగా డీఐఓ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ ఆదివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కల మందు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఒకవేళ ఎవరైనా బూత్ వద్ద చుక్కలు వేయించుకోకపోతే, ఈ నెల 29, 30 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చిన్నారులకు మందు వేస్తారని ఆయన స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ..జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు 1,91,883 మంది ఉన్నారని, వారి కోసం 1,007 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పట్టణాల్లో 241, గ్రామీణ ప్రాంతాల్లో 766 బూత్‌లతో పాటు 37 ట్రాన్సిట్, 37 మొబైల్ బూత్‌లను సిద్ధం చేశామని, మొత్తం 2,11,100 పోలియో డోసులను అందుబాటులో ఉంచామని వివరించారు. మారుమూల ప్రాంతాలు, ఇటుక బట్టీలు, మురికివాడల్లోని పిల్లలకు కూడా చుక్కలు వేయించేలా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రజలందరూ సహకరించి పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, డీఐఓ డాక్టర్ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.






# మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన తప్పదు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

జిల్లా ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారని, వెంటనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన సిబ్బందిని నియమించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టులు, ఎముకల వైద్య నిపుణులు లేకపోగా, స్కానింగ్‌కు కనీసం టెక్నీషియన్లు కూడా లేరని ఆయన మండిపడ్డారు. దీనివల్ల రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాబినెట్ హోదా కలిగిన స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆసుపత్రి అభివృద్ధిని పట్టించుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. తక్షణమే వైద్యులు, టెక్నీషియన్లను నియమించి, మందులను అందుబాటులో ఉంచాలని లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని రమేష్ బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఏరియా కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు వేషాల గంగాధర్, జంగం గంగాధర్, రాములు, నాగలక్ష్మి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు



# కోటగిరి కీ మంత్రి పొన్నం ప్రభాకర్ రాక

**నిజాంబాద్ కోటగిరి జూన్ 27 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లో ఎత్తోండ గ్రామానికి తెలంగాణ రాష్ట్ర బీసీ శాఖ మరియు రవాణాశాఖ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ , తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి , జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ శ్రీ సురేష్ షేట్కార్ ,తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు , నిజామాబాద్ మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ , అనగా 01/07/2026 బుధవారం రోజున ఉదయం 11 గంటలకు రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపనవేడుకల్లో పాల్గొనున్నారు కావున ఉమ్మడి కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కోటగిరి మాజీ



జెడ్పిటిసిలు మాజీ ఎంపీటీసీలు పాక్స్ మాజీ చైర్మన్లు ఉమ్మడి కోటగిరి మండల పరిధి గ్రామ సర్పంచులు కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనవలసిందిగా మా యొక్క మనవి.

# దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవమే మా లక్ష్యం.

**నిజామాబాద్ జిల్లా/కోటగిరి (డిడి 9 వార్త):**


తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవమే తమ లక్ష్యమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న పేర్కొన్నారు. దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న సామాజిక వివక్షను ఖండిస్తూ, అక్రిడేషన్ కమిటీలలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29వ తేది సోమవారం రోజున హైదరాబాద్‌లోని ఐ & పి ఆర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం సందర్భంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ బలోపేతంలో భాగంగా కోటగిరి మండల కేంద్రానికి విచ్చేసిన అయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అక్రిడిటేషన్ల విషయంలో దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రి డిటేషన్ కమిటీలలో ఇతర సామాజిక వర్గాల ఆధిపత్యం కొనసాగుతోందని, దళిత, గిరిజన జర్నలిస్టులను పక్కన పెట్టే విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుండి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు అన్యాయం జరుగుతోందని అన్నారు. 2926లో ముగిసిన అక్రిడిటేషన్లను సంవత్సరాల తరబడి కొనసాగించడపై అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు అక్రిడిటేషన్ కమిటీలలో స్థానం కలిగించినప్పుడే దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న దళిత, గిరిజన జర్నలిస్టుల పిల్లలకు నూరుశాతం రాయితీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెద్ద పత్రికలు, చిన్న పత్రికలు, యూటూబ్ చానళ్ళు అని భేదం తీసుకొని వచ్చి, జర్నలిస్టుల మధ్య చిచ్చుపెట్టడం ప్రభుత్వానికి తగదని ఆయన అన్నారు. ఈ నెల 28వ తేదీలోగా తమ దళిత, గిరిజన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి అయన డిమాండ్ చేశారు. లేదంటే జరిగే ఎలాంటి నష్టానికైనా ప్రభుత్వమే బాధ్యత వహించాలని అయన హెచ్చరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ చూపించిన మార్గంలోనే తాము నడుస్తున్నామని, అలాగని మా దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరిగితే మాత్రం ఊరుకునే ప్రసక్తేలేదని అయన ప్రకటించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజన జర్నలిస్టులు, దళిత, గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయవాదులు తమ మద్దతును ప్రకటించి, పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ పిలుపునిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నవారు పుప్పల సైదయ్య బి రాములు మోరే జీవన్ మీడియా రాము భీమ్రావు అర్జున్ యాదవ్



# పదవీ విరమణ వేళ.. పాఠశాలకు లక్ష విరాళం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడమే కాకుండా, తాము పనిచేసిన చోట చిరస్థాయిగా నిలిచిపోయేలా ఆదర్శంగా నిలిచారు బోధన్ మండలంలోని ఎరాజ్ పల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు ఉదయలక్ష్మి. గత ఎనిమిదేళ్లుగా ఇక్కడే మాతృమూర్తిలా విద్యాబోధన చేసిన ఆమె, శనివారం పదవీ విరమణ పొందుతూ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన కోడలు కావడంతో సొంత పాఠశాల అభివృద్ధిపై ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపారు. తన సుదీర్ఘ సేవాకాలం ముగింపు సందర్భంగా పాఠశాల మౌలిక వసతులు మరియు ఇతర అవసరాల కోసం తన సొంత నిధుల నుండి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో గ్రామస్తులు, పాఠశాల పాలకవర్గం మరియు విద్యార్థులు ఆమెకు భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. కేవలం విద్యాబోధనే కాకుండా పాఠశాల అభివృద్ధిని ఆకాంక్షించి ఆమె చేసిన ఈ ఆర్థిక సాయం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఆమె ఆశయాలు, దాతృత్వం ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. ఉదయలక్ష్మి నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని గ్రామస్థులు కోరుకుంటూ ఘనంగా వీడ్కోలు పలికారు.




# సినీ,యానిమేషన్ రంగాల్లో గ్రామీణ యువత రాణించాలి

**నిజామాబాద్ జిల్లా/ చందూరు (డిడి9 వార్త) :**

నిజామాబాదు జిల్లా చందూర్ గ్రామానికి చెందిన గూడూరు హన్సిక్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ (CGA ) కంప్యూటర్ గ్రాఫిక్స్ యానిమేషన్ కోర్సులో స్టేట్ ర్యాంకర్ గా నిలిచి మొట్ట మొదటి ప్రయత్నంగా ఓసిడి అనే షార్ట్ ఫిలిం తీశాడు . ఈ సందర్భంగా చందూర్ మండల్ ఏమార్వో వీరా సింగ్ చేతుల మీదుగా షార్ట్ ఫిలింను విడుదల చేయగా ప్రజల్లో విశేష స్పందన లభిస్తున్నది.సినిమా అభిమానులు అభినందనలు తెలుపుతున్నారు.

గూడూరు హన్సిక్ మాట్లాడుతూ.. గ్రామీణ యువత కూడా సినీ యానిమేషన్ రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ఈ రంగాన్ని ఎంచుకున్నాననీ, శరీర పరిశుభ్రతపై మానసిక రుగ్మత కలిగిన ఒక (ఓసిడి) విద్యార్థిగా నేను ఈ సినిమాలో నటించానని అన్నారు. ఇండియన్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీప్రసాద్ ,సాహో, ఓజి సినిమాలు చేసిన డైరెక్టర్ సుజిత్ చదువుకున్న కాలేజీ చెన్నై ఐవి ప్రసాద్ మీడియా స్టూడియోస్ లో సీట్ రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.బిఎఫ్ఎ ఫిలిం మేకింగ్ కోర్సులో చేరినట్టు తెలిపారు . ప్రజల అభిమానం ఉంటే మునుముందు మరిన్ని మంచి సినిమాలతో ముందుకు వస్తానని తెలియచేసారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ రిటైర్మెంట్ అధికారి రాథోడ్ శంకర్, విక్టరీ పాఠశాల అధినేత కొడాలి రాంచంద్రావు పాల్గొన్నారు.



# విద్యరంగ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్27(డీడీ9 వార్త):**

బోధన్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తెలంగాణ విద్యార్థి పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం బోధన్ ఆర్డీఓ విజయ కుమారికు విద్యార్థి పరిషత్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు మీసాలే నాగేష్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంకా యూనిఫామ్‌లు అందలేదని, జెడ్పీ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ టెక్స్ట్ బుక్స్ కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హామీ మేరకు విద్యార్థులకు తక్షణమే అల్పాహారం అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మండల విద్యాధికారి నాగయ్యకు వినతిపత్రం అందజేస్తూ బోధన్‌లోని ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని కోరారు. జీవో నంబర్లు 90, 91 నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ యాజమాన్యాలు పాఠశాలలను 'షాపింగ్ మాల్స్'గా మార్చేశాయని మండిపడ్డారు. పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూస్‌లను పాఠశాలల్లోనే రెట్టింపు ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ స్కూళ్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి పరిషత్ డివిజన్ కార్యదర్శి నిఖిల్, పట్టణ కార్యదర్శి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



# సర్ గురించి ఆటో అన్నలకు అవగాహన కల్పించిన ఓబీసీ సెల్ డిసిసి అధికార ప్రతినిధి పెండ్యాల మహేష్.

- **ప్రతి పౌరుడి ఓటు ప్రజాస్వామ్యానికి తోడుపాటు మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం.**

**డిడి9వార్త / పెద్దపల్లి జూన్ 28:**

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మంథని శాసనసభ్యులు ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు పిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు గార్ల నాయకత్వంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ ఆదేశాలతో అంతర్గాం మండలం మొరుమూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గడపగడపకి తిరుగుతూ సర్ గురించి అవగాహన కల్పించారు అనంతరం మురుమూరు ఆటో అడ్డా వద్ద ఆటో అన్నలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు డిసిసి అధికార ప్రతినిధి పెండ్యాల మహేష్ మాట్లాడుతూ ఆటో అన్నలు అవగాహన కలిగి ఉంటే అనేక మందికి వివరించే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకొని చిన్నచిన్న కారణాలతో ఓట్లను తొలగించే ప్రక్రియ భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేపట్టిన నేపథ్యంలో దాన్ని తిప్పికొడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ ప్రజలకు అవగాహన కల్పించి ఎస్ఐఆర్ లో పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగే విధంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి మన వంతు పాత్రను పోషించే విధంగా చైతన్యవంతమైన ప్రజలందరూ మిగతా అందరికీ వివరించి చెబుతూ ప్రతి ఒక్కపౌరుడు ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు చేపట్టే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉంటారని ఏమైనా సందేహాలు ఉన్న ఇబ్బందులు ఉన్న మమ్మల్ని సంప్రదిస్తే తప్పకుండా సహకరిస్తామని తెలియజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉరిమెట్ల రాజలింగం మాట్లాడుతూ ప్రతి పౌరుడి ఓటు ప్రజాస్వామ్యానికి తోడ్పాటు అని చిన్నచిన్న కారణాలతో ఎవరు కూడా ఓటు హక్కును కోల్పోవద్దని తప్పకుండా జాగ్రత్తగా సర్ కార్యక్రమంలో పాల్గొని మన విలువైన ఓటును కాపాడుకుందాం అని ప్రజలకు పిలుపునిచ్చారు భారతీయ జనతా పార్టీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకొని ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయండి అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్ మాజీ ఎంపీపీ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉరిమెట్ల రాజలింగం గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్రె చందు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మగ్గిడి రాకేష్ మాజీ ఉపసర్పంచ్ అనుమల్లా రాకేష్ బాణాల రవి జూల విజయ్ జూల రవి లంక మదనయ్య మరుమూర్ ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు డ్రైవర్ అన్నలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# బోధన్‌లో రోడ్ల దుస్థితిపై బీజేపీ నిరసన

**బోధన్, నిజామాబాద్ జూన్27(డీడీ9 వార్త):**

బోధన్ మున్సిపాలిటీ రాకాసిపేట్ లోని అయ్యప్ప గుడి కమాన్ నుంచి బెల్లాల్ వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా తయారైందని రోడ్డు మొత్తం గుంతలమయమై, వర్షపు నీరు నిలవడంతో ఆ ప్రాంతం చెరువును తలపిస్తోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రహదారిపై ఉన్న గుంతల్లో వరి నాట్లు వేసి తమ నిరసనను తెలియజేశారు. ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారుల వెన్నుపూసకు ఇబ్బంది కలుగుతోందని, పాఠశాల విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే 18 కోట్ల రూపాయల నిధులు మంజూరైనా, పనులు ఎందుకు చేపట్టడం లేదని, ప్రజాప్రతినిధులకు బాధ్యత లేదా అని నాయకులు నిలదీశారు. ఇప్పటికైనా రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, లేని పక్షంలో 38 వార్డులలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

- **అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు వినతి**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్లు సమస్యలతో సతమతం అవుతున్నామని, ప్రభుత్వం స్పందించి రైస్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైస్ మిల్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ కోరారు. ఈ మేరకు శనివారం రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులందరూ హైదరాబాదుకు చేరుకొని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ను కలసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆమెకి అందజేశారు. దానికి స్పందించిన మంత్రి సీతక్క వెంటనే సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ కి ఫోన్ చేసి మాట్లాడి రైస్ మిల్లర్ల సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ మాట్లాడారు.

ములుగు జిల్లాలో గత 2024 25 రబీ సీజన్ లో 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్మెంట్ జరిగిందని అన్నారు.ఈసారి అనూహ్యంగా దిగుబడి పెరిగి లక్ష 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్మెంట్ చేయడం జరిగిందని, ఇట్టి ధాన్యం జిల్లాలో గోదాముల కొరత వలన ఆరుబయట ఓపెన్ స్పేస్ లో నిలువ చేయడం జరిగిందని తెలిపారు.అకాల వర్షాలకు ధాన్యం క్వాలిటీ దెబ్బతిని ఎఫ్సీఐలో బియ్యం పాస్ కావని అన్నారు.అధికారులు వెంటనే స్పందించి జిల్లాకు బాయిల్డ్ బియ్యం ఎఫ్సీఐకి పెట్టుటకు పర్మిషన్ ఇప్పించాలని కోరారు. అందులో భాగంగా మంత్రి సీతక్క ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ కి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసారని అన్నారు. అందుకు గాను ములుగు జిల్లా రైస్ మిల్లర్ల పక్షాన మంత్రి సీతక్క కు ఆయన ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి సహోదరు రెడ్డి కోశాధికారి ఎలగందుల మోహన్ గౌరవ అధ్యక్షులు పల్లెపాటి సంగిరెడ్డి గౌరవ సలహాదారులు రాణి శ్రవణ్ కుమార్ అనిల్ కుమార్ లు పాల్గొన్నారు.



# సింగరేణిలో బొగ్గు మాయం ప్రచారం దుర్మార్గం

- **కార్మికుల హక్కుల కోసం అవసరమైతే సమ్మెకు వెనుకాడం**
- **ఏఐటీయూసీ హెచ్చరిక**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**

సింగరేణిలో బొగ్గు మాయమైందంటూ బీజేపీ, బీఆర్ఎస్, టీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, దుర్మార్గమైన రాజకీయ ప్రచారమని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఖండించారు.

శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...., ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం అధికారులు అదనంగా బొగ్గును కలిపి చూపించడం జరిగినప్పటికీ, బొగ్గు మాయమైందనే ప్రచారం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు.

జూన్ 8న యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చామని, జూన్ 25న ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిగాయని, జూలై 10లోపు యాజమాన్యం యూనియన్‌తో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించిందని తెలిపారు. డిమాండ్ల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణ నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని, కాంగ్రెస్ పాలనలో రాజకీయ జోక్యం పెరిగిందని ఆరోపించారు. అలాగే 12వ వేజ్ బోర్డు అమలు, కొత్త గనుల ఏర్పాటు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని ప్రకటించారు.

ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి.రావు, కే. వీరబద్రం, కే. స్వామి, రాజరత్నం, రాంచందర్, గౌతమ్ గోవర్ధన్, రంగు శ్రీను, గంధం సాంబశివ రావు, టి. రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# 48వ డివిజన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **సీసీ రోడ్లు, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఉద్యమకారుడు నీలం భిక్షపతి విజ్ఞప్తి**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**



రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 48వ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుడు నీలం భిక్షపతి కార్పొరేటర్, మున్సిపల్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...,సాయినాథ్ కాలనీలో సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే కేసీఆర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, టీచర్స్ కాలనీల్లో పాముల సంచారం అధికంగా ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పెరిగిన పొదలు, అపరిశుభ్ర పరిస్థితులను తొలగించి ఫాగింగ్, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

అదేవిధంగా ఆయా కాలనీల్లో అనేక వీధి దీపాలు పనిచేయడం లేదని, దీంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీటి కొరత కూడా తీవ్రంగా ఉందని, వెంటనే తగిన చర్యలు తీసుకుని ప్రతి ఇంటికి సరిపడా మంచినీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. 48వ డివిజన్ కార్పొరేటర్, నగరపాలక సంస్థ అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సీసీ రోడ్ల నిర్మాణం, స్ట్రీట్ లైట్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, పాముల నివారణ చర్యలు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని నీలం భిక్షపతి కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రైతులకు కూరగాయల విత్తనాల పంపిణీ

- రూ.10.30 లక్షల విలువైన విత్తనాలతో 200 మంది రైతులకు ఎన్‌టీపీసీ అండ
- సీఎస్ఆర్‌లో భాగంగా 20 గ్రామాల రైతులకు ఎన్‌టీపీసీ నుంచి వ్యవసాయ ప్రోత్సాహం









**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**

సామాజిక అభివృద్ధి, రైతుల జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా ఎన్‌టీపీసీ రామగుండం తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా లైఫ్ స్కిల్ అకాడమీ, బ్లాక్ 2లో రైతులకు కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా హాజరై రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలు, పరిసర గ్రామాలు, కార్పొరేషన్ డివిజన్లకు చెందిన 20 గ్రామాల నుంచి సుమారు 200 మంది రైతులకు రూ.10.30 లక్షల విలువైన కూరగాయల విత్తనాలను అందజేశారు.

ఈ సందర్భంగా చందన్ కుమార్ సమంత మాట్లాడుతూ... సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం ఎన్‌టీపీసీ లక్ష్యమని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి కూరగాయల సాగును విస్తరించాలని రైతులకు సూచించారు. సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

విత్తనాల పంపిణీతో కిచెన్ గార్డెనింగ్, కూరగాయల సాగు ప్రోత్సాహం పొందడంతో పాటు గ్రామీణ కుటుంబాలకు పోషకాహార భద్రత, అదనపు ఆదాయం లభిస్తుందని అధికారులు తెలిపారు. విత్తనాలు అందించినందుకు రైతులు ఎన్‌టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



## సింగరేణి కార్మికుల పిల్లలపై ఫీజుల భారం ఎందుకు?

- వాణి హైస్కూల్ ఫీజుల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలి
- బీజేపీ ఎంపీటీసీల ఫోరం డిమాండ్

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**

సింగరేణి సౌజన్యంతో నిర్వహిస్తున్న సెంటినరీ కాలనీ వాణి హైస్కూల్‌లో ఇటీవల ఫీజులు పెంచడం సింగరేణి కార్మిక కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని బీజేపీ ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పాఠశాలలో మౌలిక సదుపాయాల విస్తరణ, విద్యా ప్రమాణాల మెరుగుదల లేదా కొత్త సౌకర్యాల కల్పనపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా ఫీజులు పెంచడం సమంజసం కాదన్నారు. కార్మికుల సంక్షేమం కోసం నడవాల్సిన విద్యాసంస్థల్లోనే కార్మిక కుటుంబాలపై అదనపు భారం మోపడం బాధాకరమని పేర్కొన్నారు.

వెంటనే సింగరేణి యాజమాన్యం స్పందించి ఫీజుల పెంపుపై పూర్తి వివరాలు వెల్లడించాలని, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఫీజుల పెంపును పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలలో సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఫీజుల అంశంపై స్పందించకపోతే విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీటీసీల ఫోరం నాయకులు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, దంతుల సురేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అపరిశుభ్రంగా మాంసం విక్రయిస్తే లైసెన్సులు రద్దు

- నిబంధనలు ఉల్లంఘిస్తే మార్కెట్ నుంచి ఖాళీ చేయిస్తాం
- మేయర్ మహంకాళి స్వామి హెచ్చరిక

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**

అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయాలు నిర్వహిస్తే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు మార్కెట్ నుంచి ఖాళీ చేయిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హెచ్చరించారు. వార్డు సందర్శనలో భాగంగా శనివారం 39వ డివిజన్ శివాజీనగర్ కూరగాయల మార్కెట్‌ను డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ తిప్పారపు మానసతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మాంసం దుకాణాల వద్ద నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులను గమనించిన మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాంసం వ్యర్థాలను కాలువల్లో వేయడం, చెత్తను మున్సిపల్ వాహనాలకు ఇవ్వకుండా నిల్వ ఉంచడం వంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువధశాలను వినియోగించుకోవాలని, వర్షాకాలంలో అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

మార్కెట్‌లోని చెత్త, ప్లాస్టిక్ కవర్లు, శిథిల వస్తువులు, పిచ్చి మొక్కలను తొలగించి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. చిన్న, పెద్ద కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానాలు విధించాలని, చెత్తను బహిరంగంగా పారబోస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూరగాయల వ్యర్థాలను మార్కెట్‌లోనే రీసైక్లింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్కెట్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నిధులతో చేపడుతున్న పనులను వ్యాపారులు సహకరించాలని, మార్కెట్ పక్కన 40 అడుగుల వెడల్పుతో కొత్త రహదారి నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందికి అల్పాహారం ఏర్పాటు చేశారు. నిరంతరంగా వెయ్యి రోజులుగా కొనసాగుతున్న అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ అభినందించారు.



## చల్వాయి మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు.

- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఖాళీ సీట్ల భర్తీ – ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం
- కళాశాల ప్రిన్సిపల్ గండు కుమార్



**గోవిందరావుపేట, జూన్ 27(డిడి 9 వార్త)**

మండలంలోని చల్వాయి తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గండు కుమార్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి జూలై 7వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. 6, 7, 8వ తరగతులకు ప్రవేశ పరీక్ష రాయలేకపోయిన విద్యార్థులకు కూడా ఆఫ్‌లైన్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి జూన్ 29, 30 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు అడ్మిషన్లు పొందాలని సూచించారు. అదేవిధంగా, చల్వాయి మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఫిజిక్స్ బోధన కోసం గంటల ప్రాతిపదికన ఫిజిక్స్ లెక్చరర్‌ను నియమించనున్నట్లు ప్రిన్సిపల్ గండు కుమార్ తెలిపారు. ఎంఎస్సీ, బీఈడీ అర్హతలతో పాటు బోధన అనుభవం ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జూలై 3న ఇంటర్వ్యూలు నిర్వహించి, జూలై 4న నియామక ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 8096350115 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## SIR ప్రక్రియపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వివరించిన BLOలు..

- ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూన్ 27 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (SIR)లో భాగంగా ఈరోజు మణుగూరు మండలం సమితి సింగారం అరుంధతి నగర్ లో బూత్ లెవల్ అధికారులు (BLOలు) పినపాక ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లుకి మరియు వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన SIR దరఖాస్తు పత్రాలను అందజేశారు. అనంతరం SIR కార్యక్రమం అమలు విధానం, దరఖాస్తుల స్వీకరణ, ఓటరు వివరాల ధృవీకరణ, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయడం వంటి అంశాలను ఎమ్మెల్యేకి వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుండి మినహాయించబడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలు, కాలనీలు, గిరిజన ప్రాంతాలు మరియు దూర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు SIR ప్రక్రియపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని కోరారు. దరఖాస్తుల సమర్పణ విధానం, అవసరమైన పత్రాలు, నమోదు ప్రక్రియ తదితర అంశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాలని BLOలకు సూచించారు. ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ నరేశ్, డీటీ రామారావు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, జిల్లా జనరల్ సెక్రటరీ పోలమూరి రాజు, రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, ఎస్. గణేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, BLOలు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మరియు వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన SIR దరఖాస్తు పత్రాలను BLOలు అందజేయగా, కార్యక్రమం అమలు విధానంపై ఎమ్మెల్యే పూర్తి వివరాలు తెలుసుకుని ఓటర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.





## త్రాగునీటి ఎద్దడికి చెక్.. రాంనగర్‌లో పైప్‌లైన్ పనులకు శ్రీకారం

- ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన సర్పంచ్ పల్లె ప్రతిమ

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని రాంనగర్‌లో నెలకొన్న త్రాగునీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్ పనులను సర్పంచ్ పల్లె ప్రతిమ శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...., గత కొద్ది రోజులుగా రాంనగర్ పునరావాస కాలనీలో తీవ్ర త్రాగునీటి ఎద్దడి నెలకొన్నట్లు స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. బొడ్రాయి-పోచమ్మ దేవాలయం మధ్య ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ఈ పైప్‌లైన్ ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నం మనితేజ, గ్రామ కార్యదర్శి గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమంలో మహాయాగంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులు..

**మణుగూరు.జూన్ 27(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమంలో నిర్వహించిన మహాయాగ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కూడా యాగ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన యాగంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, రైతాంగ సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఆశ్రమ నిర్వాహకులు వేద ఆశీర్వచనాలతో అతిథులను సత్కరించి యాగ విశిష్టతను వివరించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల భావనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ధార్మిక విలువలను పాటిస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలలో నిర్వహించే యాగాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా సామాజిక ఐక్యతకు దోహదపడతాయని అన్నారు.ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కూడా యాగం విజయవంతంగా నిర్వహించిన ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, వేద పండితులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మరియు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పెద్ద సంఖ్యలో భక్తజనులు పాల్గొన్నారు. యాగం అనంతరం ప్రత్యేక పూజలు, ఆశీర్వచనాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## రాజ్యాధికార సమరభేరికి ఆహ్వానాల పంపిణీ

**జనగామ జూన్ 27 (డిడి 9వార్త )బ్యూరో**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న నిర్వహించనున్న 'రాజ్యాధికార సమరభేరి' బహిరంగ సభకు సంబంధించిన ఆహ్వాన పత్రాల పంపిణీ కార్యక్రమం జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్, చిల్పూర్ మండలాల్లో ప్రారంభమైంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులను కలిసి సభకు హాజరుకావాలని ఆహ్వానించారు. సమరభేరి సభను విజయవంతం చేసేందుకు బహుజనులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## 26 ఏళ్ల సేవకు వేటు.. ర్యాగ్ పిక్కర్ల ఉపాధికి గండం

- **పైలెట్ ప్రాజెక్టు ఏజెన్సీలను రద్దు చేసి ర్యాగ్ పిక్కర్లను ఔట్‌సోర్సింగ్‌లోకి తీసుకోవాలి**
- **ఏఐటీయూసీ డిమాండ్**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో గత 26 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ర్యాగ్ పిక్కర్లు, ఇంటింటి చెత్త సేకరణ కార్మికుల ఉపాధిని పైలెట్ ప్రాజెక్టు ఏజెన్సీల పేరుతో దెబ్బతీయొద్దని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది.

శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం యూనియన్ రామగుండం అధ్యక్షుడు మద్దెల దినేష్, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. గౌస్ మాట్లాడుతూ, ర్యాగ్ పిక్కర్లు ప్రారంభంలో నెలకు రూ.250 మ్యాచింగ్ గ్రాంట్, ఇంటింటి నుంచి రూ.5, రూ.10 చొప్పున వసూలు చేసుకుంటూ జీవనం సాగించారని తెలిపారు. ఏఐటీయూసీ కృషితో మ్యాచింగ్ గ్రాంట్ రూ.4 వేలకు పెరగడంతో పాటు ఇంటి యజమానుల నుంచి రూ.50 వసూలు చేసే అవకాశం రావడంతో వారి జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని చెప్పారు.

అయితే, ఔట్‌సోర్సింగ్‌లో అవకాశం కల్పిస్తారనే ఆశతో ఎదురుచూస్తున్న కార్మికులపై పైలెట్ ప్రాజెక్టు ఏజెన్సీలను ప్రవేశపెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. 26 ఏళ్లుగా పని చేస్తున్న డివిజన్లలో కొత్త ఏజెన్సీలను నియమించవద్దని, ర్యాగ్ పిక్కర్లను నేరుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో చేర్చాలని డిమాండ్ చేశారు. ర్యాగ్ పిక్కర్లలో ఎక్కువ మంది మాదిగ, మాల, వడ్డెర తదితర వెనుకబడిన వర్గాలకు చెందిన వారేనని, వారి ఏకైక జీవనాధారాన్ని దూరం చేయవద్దని కోరారు. పైలెట్ ప్రాజెక్టు ఏజెన్సీలను వెంటనే రద్దు చేసి, కార్మికులు సొసైటీ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకునే ముందు ర్యాగ్ పిక్కర్ల మహిళా సంఘాలు, డ్వాక్రా గ్రూపులు, ఏఐటీయూసీ ప్రతినిధులతో చర్చించాలని సూచించారు. ఈ వినతిపత్రం ప్రతులను సీడీఎంఏ హైదరాబాద్, ఆర్‌డీఎంఏ వరంగల్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు కూడా పంపినట్లు నాయకులు తెలిపారు.

## ములుగు జిల్లాలో విషాదం పిడుగుపాటుకు 21ఆవులు మృతి

- **బాధిత కుటుంబానికి అండగా ప్రజా ప్రభుత్వం**
- **మంత్రీ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న సూచనల మేరకు**

**తాడ్వాయి మండలం జూన్ 27 (డిడి9 వార్త)**

మంత్రీ వర్యులు సీతక్క చొరవతో సహాయం అందిస్తామని వారి కుటుంబానికి హామీ ఇచ్చిన ములుగు జిల్లాకాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇర్ప సునీల్ ములుగు జిల్లా , తాడ్వాయి మండలం అంకంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి విషాదకర ఘటన చోటుచేసుకుంది , ఆవులను ఇంటి సమీపంలోని బాధిత రైతు మంకిడి సమ్మయ్య పొలంలో కట్టివేయగా, భారీ వర్షంతో పాటుగా ఒక్కసారిగా పిడుగు పడటంతో 21 ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి ఈసంఘటన తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇర్ప సునీల్ వారి కుటుంబాన్ని పరామర్శించి పశువుల యజమాని సమ్మయ్యతో మాట్లాడుతూ ఇట్టి విషయాన్ని రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అరెమ్ లచ్చు పటేల్ , అంకంపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు , బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్ , మండల నాయకులు ఆలేటి జైపాల్ రెడ్డి , మండల నాయకులు , గ్రామస్థులు పాల్గొన్నారు



## దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్

- **పెన్ను పట్టిన,వీడియో కెమెరా పట్టి తమ విధులు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహిస్తున్నా వారందరు జర్నలిస్ట్ లిస్టులే.!!సుప్రీం కోర్ట్**

**తాడ్వాయి మండలం జూన్ 27 (డిడి9 వార్త)**

ఇకపై కావాలనే కక్ష్యతో రాజకీయనాయకులు,అక్రమ సంపాదన దందాలు చేసే వారు ,వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు చెల్లనేరావు సుప్రీం కోర్టు శాటిలైట్ యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్,ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజ నిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని,వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై,అట్టి పోలీస్ లపై వేట తప్పదు:సుప్రీం కోర్ట్








## ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో టౌన్‌షిప్ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు

- **చిన్నారుల్లో విద్యుత్ భద్రతపై చైతన్యం**

**పెద్దపెల్లి బ్యూరో, జూన్ 27 (డీడీ9 వార్త):**

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు (జూన్ 26-జూలై 2) సందర్భంగా ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో టౌన్‌షిప్ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యుత్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయం, శ్రీ చైతన్య పాఠశాల, సెయింట్ క్లేర్ పాఠశాలతో పాటు ఇతర విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యుత్ భద్రతపై ఇంటరాక్టివ్ సెషన్లు, ప్రదర్శనలు, అవగాహన ఉపన్యాసాలు నిర్వహించారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదని, దెబ్బతిన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆడుకోవద్దని, ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే పెద్దలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిలో విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించే 'సేఫ్టీ అంబాసిడర్లుగా' వ్యవహరించాలని ప్రోత్సహించారు. "విద్యుత్ భద్రత అనేది అదృష్టం కాదు... మన ఎంపిక" అనే సందేశాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విద్యుత్ భద్రతా నియమాలను పాటిస్తూ, సమాజంలో భద్రతా సంస్కృతిని పెంపొందించేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించగా, భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఎన్‌టీపీసీ తన కట్టుబాటును మరోసారి చాటుకుంది.

## గుర్వాయిగుడెం లో అంగరంగ వైభవం గా బోడ్రయి, గ్రామదేవత ముత్యాలమ్మ తల్లీ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మరియు పోతురాజు శిరస్సులు మహోత్సవం ...






- **ముఖ్య అతిథి గా హాజరు అయ్యిన బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం**
- **వేదమంత్రాలు, మంత్రోచ్చరణ తో పూర్ణకుంభం తో సోయం కి ఘనా స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు**
- **ఆలయ అభివృద్ధి నిమిత్తం 5,116/- రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు అంధజేసిన భా.ర.స నాయకులు సోయం వీరభద్రం**

**అశ్వరావుపేట:జూన్ 27(డిడి 9 వార్త)**

అశ్వరావుపేట (నియోజకవర్గం) దమ్మపేట (మండలం) గుర్వాయిగుడెం గ్రామం లో గ్రామస్థులు ఆహ్వానం మేరకు నాభిశిల బోడ్రాయి గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లీ అమ్మ వార్ల దివ్య ప్రతిష్ఠ మహోత్సవం లో ముఖ్య అతిథి గా పాల్గొన్నా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం.వారికి వేద పండితులు ఘనా స్వాగతం పలికి ఆహ్వానించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు .స్వామి వార్ల దివ్య ఆశీర్వాదలూ అంధరి పైన ఉండాలి అని సుఖసంతోషాలు ,ఆయుర్ ఆరోగ్యములుతో నిండుగా వర్ధిల్లాలి అని అన్నారు .అనంతరం ఆలయ అభివృద్ధి నిమిత్తం ఆలయ కమిటీ సభ్యులు కి 5,116/ అంధజేసిన జిల్లా భారస నాయకులు సోయం వీరభద్రం. ఈ కార్యక్రమం లో తాటి.ముత్యాలు కీసరి సింగరాజు,ధర్మయ్య,వెంకటేష్ పోతురాజు ,సరియం గంగరాజు,కుంజా పాపారావు,కోర్రీ. వెంకటేష్ రవీంద్ర, చిన్నరాజు,కీసరి మల్లికార్జునరావు పూకే నరసింహరావు ,సోయం వెంకన్నబాబు యువజన కమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.






## అన్నపురెడ్డిపల్లి మండలంలో కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించడమే లక్ష్యం --- ఎమ్మెల్యే జారె**
- **అసలైన ఓటర్లు జాబితా నుంచి తొలగిపోకుండా బిఎల్ఏలు సమర్ధవంతంగా గ్రామస్థాయిలో పనిచేయాలి**

**అశ్వరావుపేట:జూన్ 27(డిడి 9 వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలంలో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటించారు ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని మర్రిగూడెం అన్నపురెడ్డిపల్లి అబ్బుగూడెం గ్రామపంచాయతీల పరిధిలో పరిశీలించారు ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్న బీఎల్‌వోల పనితీరును పరిశీలించి కాంగ్రెస్ పార్టీ తరపున నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లకు తగిన సూచనలు ఇచ్చారు ఈ క్రమంలో మాట్లాడుతూ అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు అలాగే ఇప్పటికే ఓటు హక్కు ఉన్న వారి పేర్లు ఎలాంటి కారణాలతోనూ జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్‌వోలు బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పారదర్శకంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు ప్రజలు కూడా తమ వివరాలను సక్రమంగా అందించి ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు శాంతినగర్ ఎర్రగుంట గ్రామాలలో నిర్మాణంలో ఉన్న పాఠశాలల ప్రహరీ గోడలు VO బిల్డింగ్లు భవిత భవనాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పర్సా వెంకట్ ,సీనియర్ నాయకులు వనమా గాంధీ, భానోత్ భీముడు, వేముల రమణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల నరేష్, ఎమ్ఆర్ఓ స్వర్ణ, ఎంపీడీఓ పీసీసీ జిల్లా సభ్యులు వీరబోయిన నాగేశ్వరరావు, దుబ్బాకుల రాము, మరకాల లక్ష్మారెడ్డి, NSUI మండల అధ్యక్షులు బాజీబాబా,బాలసాని శ్రీను, కోండ్రు రత్నం బాబు , తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## గోదావరి వరదలపై ముందస్తు కార్యాచరణకు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూన్ 27(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు. గోదావరి నదికి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల పరిస్థితులు మరియు జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు రక్షణ చర్యలపై ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వరద ముప్పు ప్రాంతాలు, గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల పరిస్థితులు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, ఆహార సరఫరా, రహదారుల రక్షణ, సహాయక చర్యలు తదితర అంశాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ పరిధిలోని వరద ప్రభావిత గ్రామాల పరిస్థితులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే పునరావాస కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సహాయం అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్యే రామ్ దాస్ నాయక్, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని వరదల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని పూర్తిగా నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని,వరదల ప్రభావాన్ని తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.







# భద్రాచలానికి కరకట్టే శ్రీరామరక్ష.. పనుల్లో వేగం పెంచండి

- -కరకట్ట విస్తరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- --రూ.38 కోట్లతో విస్తరణ పనులు.. నాణ్యతలో రాజీ వద్దు
- --కరకట్ట విస్తరణ పనుల్లో జాప్యం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం
- అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**భద్రాచలం, జూన్ 27 (డిడి9 వార్త)**

గోదావరి నదికి 70 అడుగులకు పైగా వరద వచ్చినా, భద్రాచలం పట్టణంలోకి నీరు రాకుండా రక్షణ కవచంలా నిలిచే కరకట్ట విస్తరణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న కరకట్ట పనులను స్వయంగా పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1986 నాటి గోదావరి వరదల భీభత్సాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పట్లో చేపట్టిన కరకట్ట నిర్మాణం నేటికీ పట్టణానికి రక్షణగా నిలుస్తోందని గుర్తుచేశారు. ప్రజల భద్రతను ప్రాధాన్యతగా తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 38 కోట్లతో కరకట్ట విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. జాతీయ రహదారి వంతెన డిజైన్ల ఖరారులో జరిగిన జాప్యం వల్ల పనులు కొంత ఆలస్యమయ్యాయని, ఇకపై ఎలాంటి సాంకేతిక అడ్డంకులు లేనందున నీటిపారుదల, జాతీయ రహదారుల శాఖ అధికారులు సమన్వయంతో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాబోయే వరదలను దృష్టిలో ఉంచుకుని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి హెచ్చరించారు. కరకట్ట విస్తరణ పూర్తయితేనే భద్రాచలం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా చూడగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, నీటిపారుదల, జాతీయ రహదారుల శాఖల ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వారపు సంత ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ను ఆహ్వానించిన సమితి సింగారం ప్రజాప్రతినిధులు.

- ప్రజలకు, రైతులకు,చిన్న వ్యాపారులకు మేలు చేసే వారపు సంత ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూన్ 27 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలంలోని బస్ డిపో - జూనియర్ కళాశాల సందులో నూతనంగా ఏర్పాటు చేసిన వారపు సంత (అంగడి) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాధవరావు మాట్లాడుతూ, మణుగూరు ప్రజల సౌకర్యార్థం బస్ డిపో - జూనియర్ కళాశాల సందులో నూతన వారపు సంతను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. గతంలో వారపు సంత కోసం ప్రజలు దూరంలోని పీవీ కాలనీకి వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం మణుగూరులోనే సంత ఏర్పాటు కావడంతో ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు ఎంతో ప్రయోజనం పొందనున్నారని తెలిపారు.ఆహ్వాన పత్రికను స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే ఈ కార్యక్రమానికి హాజరై నూతన వారపు సంతను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేస్తున్న ఇటువంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ నెల 28వ తేదీ (ఆదివారం) సాయంత్రం 4:00 గంటలకు నూతన వారపు సంత ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు, వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, విప్పల సింగారం ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, కాంగ్రెస్ నాయకులు S గణేష్ రెడ్డి, యాకుబ్ అలీ, M రవీంద్ర నాథ్, AM చారి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# పిల్లలకు పోలీయో చుక్కలు వేయాలని లక్ష్యంగా

**తిరుమలాయపాలెం, జూన్ 27, డి డి 9 వార్త**

సుబ్లేడు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం 2795 మంది పిల్లలకు పోలీయో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సుబ్లేడు పి.హెచ్.సి వైద్యాధికారి మెడికల్ ఆఫీసర్ డా.బి వసుంధర తెలిపారు. పోలియో కార్యక్రమం సందర్భంగా శనివారం సుబ్లేడులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సుబ్లేడు పి హెచ్ సి పరిధిలో 2 రూట్లలో 23 బూతులు ఏర్పాటుచేశామని వాటిలో మొత్తం 5ఏళ్ళ లోపు 2795 మంది పిల్లలున్నట్టు గుర్తించామని చెప్పారు. వీరందరికీ వ్యాక్సిన్ వేసేందుకు గాను మొదటిరోజు బుతుల్లో పిల్లలకు వ్యాక్సిన్ వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. టార్గెట్ ప్రకారం 2795 మందికి పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రతీ బూతులో ఉదయం పోలియో చుక్కలు వేసే కార్యక్రమం మొదలవుతుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఆయుష్ డాక్టర్ సుందర్, సూపర్ వైజర్లు మాధవి, కుమారి, పర్మాసిస్ట్ గంధసిరి లింగమూర్తి, స్టాఫ్ నర్సులు స్వరూప రాణి, సుందరి,సిబ్బంది ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# నేడు పల్స్ పోలియెకు సర్వం సిద్ధం..!!

- కొడిశల,కాటాపురం, తాడ్వాయి, ఆసుపత్రుల్లో ఏర్పాట్లు,,
- డి ఎం హెచ్ ఒ గోపాల్ రావు ఆదేశాల మేరకు,,,,
- ఈనాడు ఆసుపత్రుల పరిదిలో కేంద్రాలు ఏర్పాటు,,,
- స్టాప్,సిబ్బంది అందుబాటులో ఉంటారు,,,

**తాడ్వాయి మండలం, డి డి 9 వార్త జూన్ 27**




నేడు పల్స్ పోలీయె చుక్కలు వేసెందుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు,,మండల ఇంచార్జి డాక్టర్ రంజిత్ కుమార్ కాటాపురం, కొడిశల, తాడ్వాయి,పీ హెచ్ సి ల పరిదిలో 28 పోలీయె బూత్ లను ఏర్పాటు చేయించారు, ఇందులో 3ట్రాన్సిట్ కేంద్రాలు, 5 గురు సూపర్ వైజర్లు, పర్యవేక్షన ఉంటుంది,20మంది ఎ ఎన్ ఎంలు,50 మంది ఆశావర్క ర్లు,పనిచేస్తారని తెలిపారు కాటాపురం,ఏరియ,కొడిశల ఏరియా,మేడారం ఏరియాలలొ పోలీయెకు అన్ని ఏర్పాట్లు, 1500మెంబర్సు ఉంటారు, జీ రొ నుంచి,5 ఏండ్ల పిల్లలు వేయబడును తల్లిదండ్రులు తగువిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, అందరి సహకారంతొ విజయవంతం చేయలని కోరారు,

# వివాహ వేడుకకు హాజరైన మండల BRS పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్.

- నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**మణుగూరు.జూన్ 27 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం,రామచంద్రాపురం గ్రామ పంచాయతీలో మండల BRS పార్టీ యువజన నాయకులు జక్కుల సందీప్_దివ్య దంపతుల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన అశ్వాపురం మండల BRS పార్టీ అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని దీవించారు. ఈ కార్యక్రమం లో మల్లెలమడుగు ఉప సర్పంచ్ దాడిద మహేష్,EX ఎంపీటీసీ బండారి బలరాం,మందా హుస్సేన్,మందా నరహింహారావు,కాసమంచి మహేష్,ఊకే సాయి,తదితరులు పాల్గొన్నారు.



# భద్రగిరి మార్ట్‌లో అధికారుల ఆకస్మిక తనిఖీ

**భద్రాచలం టౌన్, జూన్ 27 ( డిడి9 వార్త )**

భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న 'భద్రగిరి మార్ట్'లో ఐటీడీఏ ఉన్నతాధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏపీఓ (జనరల్) హెచ్. డేవిడ్ రాజ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్. రాంబాబు, ఆఫీస్ మేనేజర్ ఎస్. ఆదినారాయణలు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మార్ట్‌లో ఉన్న నిల్వలను (స్టాక్‌ను) క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చి ధృవీకరించారు. స్టాక్ నిర్వహణ, విక్రయాల తీరుపై ఆరా తీశారు. అనంతరం మార్ట్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, లావాదేవీల్లో



పూర్తి పారదర్శకతను పాటించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



# BLO లు ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ ఫారంలు తప్పనిసరిగా అందించాలి..

- అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితా లో నమోదుచేయాలి.
- పినపాక నియోజకవర్గ ERO మరియు ఐటిడిఎ పీఓ బి. రాహుల్.

**మణుగూరు.జూన్ 27(డి డి 9వార్త)**

భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా పారదర్శకత కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభమైనందున బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారములు తప్పనిసరిగా అందించి అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని 110 ఎస్టి పినపాక నియోజకవర్గం ఈ ఆర్ ఓ మరియు ఐటిడిఏ పిఓ బి రాహుల్ సంబంధిత బి ఎల్ ఓ మరియు సూపర్వైజర్లకు సూచించారు.

శనివారం నాడు మణుగూరు లోని తాసిల్దార్ కార్యాలయంలో పినపాక నియోజకవర్గం లోని బిఎల్వోలు మరియు సూపర్వైజర్లతో సర్ ప్రక్రియలో భాగంగా బి ఎల్ వో లు మరియు సూపర్వైజర్లు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ నమోదు ఏవిధంగా చేస్తున్నది పరిశీలించడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించి మండలాల వారీగా పోలింగ్ స్టేషన్లో ఓటర్ల నమోదు వివరాలు సంబంధిత తాసిల్దార్లతో ఫోన్ ద్వారా తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి బిఎల్వో మరియు సూపర్వైజర్లు ఎన్యుమరేషన్ ప్రక్రియ చాలా పగడ్బందీగా నిర్వహించాలని అన్నారు. రెండు రోజులుగా సర్ప్రక్రియ ద్వారా ఇంటింటికి తిరిగి ఓటర్ నమోదులో తక్కువ శాతం ఓటర్లను నమోదు చేసిన బి ఎల్ వో లకు సంబంధిత తహసీల్దార్లు ఫోన్ ద్వారా వారికి తెలియజేసి సక్రమంగా ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించి తప్పనిసరిగా వారి వివరాలను పొందుపరిచేలా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు పూరించేటప్పుడు తప్పులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తాసిల్దార్ నరేష్, డిటి రామారావు, ఆర్ఐ అనూష, బిఎల్వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలి

- -తప్పులు లేకుండా ఫారాలు నింపాలి
- --బూత్ స్థాయి అధికారులకు భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదేశం

**భద్రాచలం, జూన్ 27 , డిడి9 వార్త**

భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా, బిఎల్వోలు ఎన్యుమరేషన్ ఫారాలను ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని భద్రాచలం నియోజకవర్గ ఈఆర్ఓ (ERO) మరియు సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట స్పష్టం చేశారు.

శనివారం భద్రాచలం మండలంలోని రాజుపేట పారిశ్రామిక ప్రాంతం, తాతగూడ కేంద్రం మరియు లంబాడి కాలనీలలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసమే ఈ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దడం, మరణించిన వారి పేర్లను తొలగించడం మరియు ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉంటే వాటిని తొలగించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఓటర్ల నుంచి వివరాలు సేకరించే సమయంలో బిఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని, ఫారాలు నింపే విధానంపై వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. పూరించిన ఫారాలను స్వీకరించిన వెంటనే ఓటర్లకు రసీదు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# కూనంనేని సాంబశివరావు అరెస్టుపై మండిపడ్డ సీపీఐ

- నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?
- రాష్ట్ర నాయకులు రావులపల్లి రవికుమార్ ఆగ్రహం

**భద్రాచలం, జూన్ 27 డిడి9 వార్త**

ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర నాయకులు రావులపల్లి రవికుమార్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాంతియుత నిరసన తెలపడం ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల కనీస హక్కని, దానిని కాలరాస్తూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధులుగా ప్రజల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న నాయకుల గొంతును నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఇటువంటి నిర్బంధ చర్యలతో ప్రజా పోరాటాలను అణచివేయలేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ చేసిన ఖండనకు భద్రాచలం




పట్టణ సమితి పూర్తి మద్దతు ప్రకటించింది. పట్టణ సమితి ప్రతినిధి కంభంమెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలని గౌరవించి కూనంనేనిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులను భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని, ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన హెచ్చరించారు.

## ఇంజనీరింగ్ విద్యార్థినికి లాప్ టాప్ వితరణ

**బోనకల్,జూన్ 27,(డీడీ9 వార్త):**

గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన భాగం వెంకటరమణ ఇంజనీరింగ్ చదువుతున్న షేక్ ఫకీర్ కుమార్తె షహనాజ్ కి సుమారు 51 వేల రూపాయల విలువచేసే లాప్టాప్ ను రైతు వేదిక వద్ద విద్యార్థినికి అందజేశారు.ఈ సందర్భంగా ఫకీర్ కుటుంబ సభ్యులు భాగం వెంకటరమణని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు,అదేవిధంగా గ్రామస్తులు పేద విద్యార్థికి సహాయం చేసిన వెంకటరమణను అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భాగం నాగేశ్వరరావు మేదరమెట్ల నాగేశ్వరరావు, షేక్ రజ్జి మొదలగు వారు పాల్గొన్నారు.




## దక్షిణ అయోధ్య భద్రగిరికి నూతన శోభ

- **ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం**
- **రూ.540 కోట్లతో 'టెంపుల్ సిటీ'గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక**
- **రూ. 200 కోట్లతో తొలి దశ పనులు ప్రారంభం**
- **పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్**

**భద్రాచలం, జూన్ 27 (డిడి9 వార్త)**

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన పునరుద్ధరణ పనులు శనివారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పనులు చేపట్టాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.

ఉదయం 7.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భద్రాచలం దేవస్థానాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.540 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. తొలి విడతగా రూ.350 కోట్లు విడుదల కాగా, ప్రస్తుతం రూ.200 కోట్లతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. మాడవీధుల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులు చేపడుతున్నామని, 2027 జూన్‌లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి అన్ని పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన భద్రాచలం ఆలయం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. పునరుద్ధరణ పనులను ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పనుల సమయంలో ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా వేద పండితులు, ఆగమశాస్త్ర నిపుణుల సూచనల మేరకు ప్రతి నిర్మాణ ప్రక్రియ చేపట్టాలని సూచించారు.

భక్తుల దర్శనం, నిత్యపూజలు, అర్చనలు, ఇతర సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని చెప్పారు. క్యూ లైన్లు, తాగునీరు, పరిశుభ్రత, భద్రత తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర రావు, ఇరిగేషన్ ఈఈ జానీ, డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పూణేం కృష్ణ, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, వేద పండితులు, దేవస్థానం, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కూనంనేని సాంబశివరావు గారి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం...

- **సరెడ్డి పుల్లారెడ్డి - (సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి.)**

**మణుగూరు, జూన్ 27 (డి డి 9వార్త)**




హనుమకొండ జిల్లా కేంద్రంలోని అదాలత్ సెంటర్లో పేదల పక్షాన పోరాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలను ప్రభుత్వం, అధికారులు అక్రమంగా తొలగించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. నిలువ నీడ లేని పేద ప్రజలు వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగితే, వారికి మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని ముక్కలు చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో పేదల భూపోరాటాలను, ప్రజా ఉద్యమాలను అణచివేయలేరని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పేదలకు న్యాయం చేయాలని, వామపక్ష నాయకులను బేషరతుగా విడుదల చేయాలని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు ఎడారి రమేష్, తోట రమేష్,sk సర్వర్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ అధ్యక్షులు రాయల భిక్షం ,కోశాధికారి కొత్తపల్లి సీతారాములు,బోసెట్టి సంపత్,లు తీవ్రంగా ఖండించారు.

## ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- **కార్యకర్తలకు మాజీ మంత్రి పువ్వాడ పిలుపు**
- **భద్రాచలంలో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుంది : తాతా మధు**

**భద్రాచలం, జూన్ 27 డిడి9 వార్త**

తెలంగాణ సాధన కోసం అప్పట్లో ఏవిధంగా ప్రణాళికాబద్ధంగా పోరాటం సాగించామో, అదే స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు మరో సమరానికి సిద్ధం కావాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భద్రాచలంలో జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

మాయమాటలు, అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సగం కాలం కూడా పూర్తికాకముందే చతికిలబడిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి, కేవలం ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టడమే పరమావధిగా పనిచేస్తున్నారని విమర్శించారు. తన పదవిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నా, పేదలు సమస్యలతో అల్లాడుతున్నా ఆయనకు పట్టడం లేదని మండిపడ్డారు. ప్రజలు తమ తప్పు తెలుసుకున్నారని, కేసీఆర్ పాలనే మళ్లీ రావాలని ఆకాంక్షిస్తున్నారని, రానున్నది గులాబీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

**--నమ్మకద్రోహికి ప్రజలే బుద్ధి చెబుతారు: ఎమ్మెల్సీ తాతా మధు**

భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన తెల్లం వెంకట్రావు వ్యవహారశైలిపై ఎమ్మెల్సీ తాతా మధు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన ఆయనకు రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని తేల్చిచెప్పారు. భద్రాచలం బీఆర్ఎస్ కంచుకోట అని, ఇక్కడ మళ్లీ గులాబీ జెండా ఎగిరి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.




**బూత్ స్థాయిలో అప్రమత్తత అవసరం: ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి**

రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పునర్నిర్మాణ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ తెలిపారు. కార్యకర్తలు ఓటు నమోదు సరళిని గమనిస్తూ, బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి వీధిలోనూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. త్వరలోనే అన్ని స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని, పార్టీ శ్రేయస్సు కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, పలువురు ముఖ్య నాయకులు మానే రామకృష్ణ, గొడవర్తి నరసింహమూర్తి, బోదెబోయిన బుచ్చయ్య, రేసు లక్ష్మి, గంప రాంబాబు, పెనుమల్లు రామకృష్ణారెడ్డి, దొడ్డి తాతారావు, కనితి రాముడు, రావులపల్లి పృథ్వీ, ఆకోజు సునీల్ కుమార్, కోటగిరి ప్రమోద్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, అయినవోలు పవన్ కుమార్, కావూరి గోపి, తెల్లం లక్ష్మీ నారాయణతో పాటు సర్పంచులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు రాపోలు లక్ష్మణ్ మరణం సమాజానికి తీరనిలోటు....

- **ఆయన ఆశయ సాధన కోసం జర్నలిస్టు ఉద్యమించాలి....**
- **సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి....**

**జనగామ జూన్ 27(డిడి 9వార్త)బ్యూరో**



మూడు దశాబ్దాల పాటు కలయమే ఆయుధంగా పనిచేస్తూ వివిధ పత్రికల్లో టీవీలో పనిచేస్తున్న సామాజికవేత్త పాలకుర్తి గ్రామ ముద్దుబిడ్డ రాపోలు లక్ష్మణ్ శనివారం గుండెపోటుతో మృతి చెందిన చాలా బాధాకరమని సీనియర్ జర్నలిస్టు పద్మశాలి సంఘం రాష్ట్ర మీడియా ఇన్చార్జి చింతకింది కృష్ణమూర్తి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియాలో పనిచేస్తున్న లక్ష్మణ్ మృతి చాలా బాధాకరమని అన్నారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు. రోజురోజుకు జర్నలిస్టులు వార్తలు కోసం పనిచేస్తూ టెన్షన్లో గుండెపోటుతో మృతి చెందిన చాలా బాధాకరమని ఆయన అన్నారు. లక్ష్మణ్ కు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
- **భద్రాద్రిలో ఘనంగా భూవరాహ మహాయజ్ఞం**
- **మృత్తికా ప్రసాదాలను స్వీకరించిన వేలాదిమంది రైతులు**

**భద్రాచలం, జూన్ 27 (డిడి9 వార్త)**

"రైతే రాజు.. రైతు సంక్షేమమే దేశ ప్రగతికి పునాది. నేలతల్లిని నమ్ముకున్న ఏ ఒక్క రైతు కన్నీరు పెట్టుకోకుండా, ప్రతి రైతు కుటుంబం సుభిక్షంగా ఉండాలి" అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి పుణ్యక్షేత్రంలోని కల్పవృక్ష నారసింహ స్వామి సన్నిధిలో నృసింహ ఉపాసకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన 'భూవరాహ మహాయజ్ఞం'లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశానికి అన్నం పెట్టే రైతే నిజమైన రాజని, రైతు చెమట చుక్కలే ప్రపంచానికి ఆహారాన్ని అందించే బియ్యపు గింజలుగా మారుతాయని కొనియాడారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. భూవరాహ స్వామి అనుగ్రహంతో ప్రతి పొలం పచ్చగా కళకళలాడాలని, రైతుల ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం కోసం 32 దివ్యక్షేత్రాల నుంచి పవిత్ర మట్టిని సేకరించి, యజ్ఞం నిర్వహించి, 'మృత్తికా ప్రసాదాన్ని' రైతులకు పంపిణీ చేసిన డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

యజ్ఞం అనంతరం పంపిణీ చేసిన మృత్తికా ప్రసాదాన్ని తమ పంట పొలాల్లో చల్లుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది రైతులు, భక్తులు భద్రాచలానికి తరలివచ్చారు. ఈ పవిత్ర ప్రసాదంతో పంటలు సమృద్ధిగా పండాలని రైతులు కోరుకున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, వ్యవసాయ రంగానికి మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణ పై 14,15 వ వార్డులో అవగాహన....

- **పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్...**

**మెదక్ జూన్ 27(డి డి 9వార్త)**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా శనివారం మెదక్ పట్టణంలోని 14, 15 వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, 14 వ వార్డు కౌన్సిలర్ దొంతి లక్ష్మి ముత్యం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమించిన బీఎల్ఓ లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల కు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రకారం "ఒక వ్యక్తి కి ఒకే ఓటు" అనే నినాదంతో ఓటర్ల జాబితాలో పారదర్శకత ఉండాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకుండా చూడాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






## 05 సంవత్సరాలలోపు చిన్నారులకు జూన్ 28న (ఆదివారం) తప్పనిసరిగా టీకాలు వేయించాలి..

- **మణుగూరు టి.బి.జి.కె.ఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు.**

**మణుగూరు,జూన్ 27 (డి డి 9వార్త)**



ఐదు సంవత్సరాలలోపు వయస్సు గల కార్మికుల పిల్లలకు జూన్ 28న నిర్వహించే ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా టీకాలు వేయించాలని మణుగూరు ఏరియా టి.బి.జి.కె.ఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మణుగూరు ఏరియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల సమాచారం మేరకు కూనవరం పంచాయతీ, పి.వి. కాలనీ, ఏరియా పరిసర ప్రాంతాల్లో మొత్తం ఏడు టీకా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

**టీకా కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాలు:**

బాంబే కాలనీ - పల్లెదవఖానా,
మసీదు పక్కన సివిల్ కార్యాలయం,
సంత పక్కన ఆర్టీసీ బస్టాండ్,
వైఎస్సార్ నగర్, సింగరేణి ఏరియా ఆసుపత్రి ఎదురుగా పోలీస్ కంట్రోల్ రూమ్ పక్కన బస్టాండ్
సిటైప్ సమీపంలోని సివిల్ కార్యాలయం, కూనవరం పంచాయతీ కార్యాలయం.

ఈ కేంద్రాలకు సమీపంలో నివసించే అర్హత కలిగిన కార్మికుల కుటుంబాలు తమ ఐదు సంవత్సరాలలోపు పిల్లలను కేంద్రాలకు తీసుకువెళ్లి తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆయన కోరారు. ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు టీకా కార్యక్రమం కొనసాగుతుందని వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. తల్లితండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వారి ఆరోగ్యవంతమైన, ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని నాగెల్లి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.